క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో గంగయ్య

పెద్దపల్లిరూరల్: ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆర్డీవో గంగయ్య సూచించారు. పెద్దపల్లి మండలం నిట్టూరు, పెద్దకల్వలలో శనివారం ఎంపీడీవో శ్రీనివాస్, సుదర్శన్‌తో కలిసి పర్యటించి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



స్ప్రే చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సుల్తానాబాద్: పట్టణ ప్రజలు దోమలతో జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, కమిషనర్ వేణుమాధవ్ సూచించారు. పట్టణంలోని 8, 9వ వార్డుల్లో శనివారం దోమల స్ప్రే ప్రారంభించారు. సీజనల్ వ్యాధులైన జ్వరం, జలుబు, దగ్గు, డెంగీ, మలేరియా లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. నాయకులు గొట్టం మహేశ్ ఉన్నారు.

డ్రగ్స్ నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్

గోదావరిఖనిటౌన్: స్థానిక సప్తగిరికాలనీలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాలలో ఎక్సైజ్ అధికారి ఆర్.మహిపాల్ రెడ్డి, సీఐ మంగమ్మ ఆదేశాల మేరకు డ్రగ్స్ నియంత్రణ, గంజాయి నిర్మూలనపై శనివారం విద్యార్థులకు ఎస్సై శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారొద్దని హితవు పలికారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారి గురించి, వాటిని విక్రయిస్తున్న వారి వివరాలు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష, ఉపాధ్యాయులు వెంకటేశ్, సురేశ్, కనకరాజు, ఎక్సైజ్ సిబ్బంది ప్రసాద్, నరేశ్ పాల్గొన్నారు.

నేడు వీర్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ఫెర్టిలైజర్‌సిటీ: సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు ఆదివారం రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లిలో సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సింగరేణి మెడికల్ అండ్ హెల్త్ విభాగం అధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అర్చకుల బదిలీలు సబబు కాదు

రామగిరి: ఆలయ అర్చకుల బదిలీలు సబబు కాదన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర కోశాధికారి సముద్రాల విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. అర్చకుడు, ఉద్యోగి మధ్య వ్యత్యాసం గమనించాలని, అర్చకుల బదిలీలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆలయాలు, అర్చకుడు ఏర్పడ్డ తర్వాతే దేవాదాయ శాఖ ఏర్పడిందని, కానీ దేవాదాయ శాఖ ద్వారా అర్చకుడు ఏర్పడలేదన్న విషయాన్ని గ్రహించి బదిలీలను రద్దు చేయాలన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఉద్యమానికి సిద్ధం కండి

సుల్తానాబాద్: విద్యార్థులకు రావాల్సిన పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ స్టాలిన్ కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే విద్యార్థులు ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రూ.7కోట్లకు పైగా బకాయిలున్నాయని వెంటనే విడుదల చేయాలని కోరారు.

నాట్యగురువు రవికుమార్

- 20ఏళ్ల నుంచి 1500కుపైగా విద్యార్థులకు కూచిపూడిలో శిక్షణ
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో 24 అవార్డులు కైవసం



సాధించిన అవార్డులతో రవికుమార్



నాట్యరత్న నేషనల్ అవార్డు అందుకుంటున్న రవికుమార్ (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: కూచిపూడి నాట్యంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతూ అవార్డులు అందుకుంటున్నాడు రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 15వ డివిజన్ రాజీవ్‌నగర్‌కు చెందిన తాడబోయిన రవికుమార్. ఎంతో మంది విద్యార్థులకు కూచిపూడిలో శిక్షణ ఇస్తూ కూచిపూడి నాట్య గురువుగా పేరు పొందారు. తన వద్ద శిక్షణ తీసుకున్న విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అవార్డులు అందుకుంటున్నారు. నాట్యరాజా నృత్యానికేతన్ అనే పేరుతో పాఠశాలను స్థాపించారు. 20 ఏళ్ల నుంచి కాలనీ, గోదావరిఖని, చుట్టుపక్కల గ్రామాలు, పట్టణ ప్రాంతాల విద్యార్థులకు కూచిపూడిలో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 1500కుపైగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

తండ్రి ప్రోత్సాహంతోనే..

రవికుమార్‌కు నాట్యంలో ఉన్న ప్రతిభను గుర్తించిన తండ్రి నాట్య పాఠశాల, కళాశాలల్లో చేర్పించి శిక్షణ ఇప్పించాడు. తండ్రి ప్రోత్సాహంతోనే కూచిపూడిలో అడుగు పెట్టిన రవికుమార్ నాట్య గురువుగా పేరు తెచుకున్నాడు. ఏడేళ్ల పాటు ప్రభుత్వ నృత్య కళాశాలల్లో కూచిపూడి నాట్యంలో సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేశాడు. ఇప్పటి వరకు 24 రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నాడు.

చిన్నప్పటి నుంచే ఇష్టం



చిన్ననాటి నుంచే నాట్యం అంటే చాలా ఇష్టం. ఎక్కడ నృత్య ప్రదర్శనలు జరిగినా అక్కడికి వెళ్లి నాట్య ప్రదర్శనలో పాల్గొని బహుమతి అందుకోవడం సంతోషంగా ఉండేది. మానాన్న ప్రోత్సాహంతో కూచిపూడి నాట్యం నేర్చుకున్నారు. ప్రస్తుతం శిక్షణ ఇచ్చే స్థాయికి ఎదగడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది అవార్డులు అందుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– రవికుమార్, కూచిపూడి నాట్యగురువు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పెద్దపల్లిరూరల్: సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్



కమాన్‌పూర్: అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: వానాకాలంలో సీజనల్ వ్యాధులు దరి చేరకుండా చూసుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ కోరారు. పెద్దపల్లిలోని ప్రధాన కూరగాయల మార్కెట్‌ను శనివారం ఆయన సందర్శించారు. టోకు వ్యాపారులు మిగిలిన, కుళ్లిన కూరగాయలను రోడ్డుపై పారబోయడాన్ని గమనించి సిమెంట్ గాజులను ఏర్పాటు చేయాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. మేనేజర్ శివప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్‌రెడ్డి, పులిపాక రాజు, భూమేశ్, జయరాజ్, మోహన్, వేణు మెప్మా ఆర్పీ స్రవంతి, మెడికల్ ఆఫీసర్ మమత, ఏఎన్ఎం సరోజ ఉన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

కమాన్‌పూర్: గ్రామాల్లో పారిశుధ్య లోపంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి దోమ ఆదిరెడ్డి సూచించారు. మండలంలోని జూలపల్లి గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. గ్రామంలోని పలు వార్డులను సందర్శించారు. పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శేషయ్యసూరి, కార్యదర్శి వెంకటరమణ ఉన్నారు.

గ్రామాల్లో జ్వర సర్వే



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని అల్లీపూర్, చిన్నకల్వల గ్రామాల్లో జ్వరాలపై గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది శనివారం సర్వే చేయడంతో పాటు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లీపూర్‌లో డాక్టర్ అనుదీప్ పరీక్షలు చేశారు. అలాగే చిన్నకల్వలలో వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేశారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి



సూచనలు చేస్తున్న ప్రత్యేకాధికారి శివయ్య

పాలకుర్తి: పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరై విధులు నిర్వర్తించాలని, లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి, జిల్లా అటవీశాఖాధికారి శివయ్య అన్నారు. పాలకుర్తి మండల పరిధిలోని పుట్నూర్, రామారావుపల్లి, కుక్కలగూడూర్ గ్రామాల్లో శనివారం పర్యటించి పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. వాడవాడలా తిరుగుతూ స్థానికులతో మాట్లాడారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశాలున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీడీవో శశికళ రాణాపూర్, ఎఫ్‌సీఐ, ఎల్కలపల్లి గేట్, గ్రామాల్లో, ఎంపీవో షబ్బీర్ పాషా బసంత్‌నగర్, పాలకుర్తి, ఈసాలతక్కళ్లపల్లి, జయ్యారం గ్రామాలను సందర్శించి పారిశుధ్యం పనులను పరిశీలించారు. బసంత్‌నగర్‌లోని ఓరియాకాలనీలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డబుల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు



స్వీట్లు పంచుతున్న కాంగ్రెస్ నాయకులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ నుంచి పాత్కపల్లి వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ నేతృత్వంలో స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. దశాబ్దాల కింద నిర్మాణం చేసిన తారురోడ్డు గుంతలు పడి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సారయ్యగౌడ్ పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సీఆర్ఎఫ్ నిధుల నుంచి రూ.25కోట్లు మంజూరు చేయించారు. సీఎం రేవంత్‌రెడ్డికి, మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే విజయరమణారావుకు, సారయ్యగౌడ్‌కు ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, పందిల్ల మాజీ ఎంపీటీసీ రావి సదానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు మాదాసు సతీశ్, అటికం శంకర్‌గౌడ్, సబ్బని రాజమల్లు, గాజుల మోహన్, రమేశ్, దేవేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

మంజూరైన రుణాలు ఇప్పించండి

సుల్తానాబాద్: గత ప్రభుత్వంలో మంజూరైన ఎస్సీ కార్పొరేషన్ రుణాలు ఇప్పించాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతంను ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కల్వల శ్రీనివాస్ కోరారు. ఎస్సీ కార్పొరేషన్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం శనివారం ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఎస్సీల అభివృద్ధితో పాటు పలు రకాల రుణాలు ఎస్సీల అభివృద్ధి కోసం కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. శ్రీరాంపూర్ మండల అధ్యక్షుడు గీసా రాజు, చలిగంటి సదయ్య, కనకం రణధీర్ తదితరులు ఉన్నారు.

రెస్క్యూ జీఎంకు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

గోదావరిఖని: రెస్క్యూ జీఎంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌రెడ్డిని శనివారం ఘనంగా సన్మానించారు. రెస్క్యూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జీఎం శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో రెస్క్యూ మేనేజర్ బింగి మాధవరావు, గ్రూపు ఇంజినీర్లు నర్సింహారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపట్టాలి



వివరాలు తెలుసుకుంటున్న పీడీ రవీందర్

ముత్తారం: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ రవీందర్ సూచించారు. ముత్తారం మండలం ఓడేడ్, అడవిశ్రీరాంపూర్, ఖమ్మంపల్లి, సీతంపల్లి, ఇప్పలపల్లి గ్రామాలను శనివారం ఆయన సందర్శించారు. ఆయా గ్రామాల్లోని మురికి కాలువలను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో లలిత, ఎంపీవో వేణుమాధవ్, ఐకేపీ సీసీ తిరుపతి, కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై అవగాహన ఉండాలి



పొలం పనులు చేస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్‌రూరల్: విద్యార్థి దశలోనే వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని కరస్పాండెంట్ ఫాదర్ కాసు శైరెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థులు శనివారం మండలంలోని ఐతరాజుపల్లిలో వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు పొలాల వద్దకు తీసుకెళ్లారు. ఉపాధ్యాయులు వ్యవసాయ పనుల గురించి విద్యార్థులకు వివరించారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



నిల్వ నీటిని పారబోయిస్తున్న అధికారులు

ఎలిగేడు: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఏవో, గ్రామ ప్రత్యేక అధికారి ఎం.ఉమాపతి అన్నారు. మండలంలోని ర్యాకల్‌దేవుపల్లిలో శనివారం ఇంటింటా తిరుగుతూ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రాములపల్లిలో సైతం అవగాహన కల్పించారు. ఆరోగ్య విద్యా బోధకురాలు రాజేశ్వరిదేవి, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రికి విన్నవిస్తున్న గ్రామస్తులు

రామగిరి: సింగరేణి నిర్వాసిత గ్రామంగా లద్నాపూర్ గ్రామస్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం రాత్రి హైదరాబద్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో 283 మందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రావడం లేదని పలుమార్లు సింగరేణి అధికారులను కలిసినా పట్టించుకోవం లేదని విన్నవించారు. వెంటనే స్పందించిన మంత్రి సింగరేణి సీఅండ్ఎండీ బలరాం నాయక్‌తో మాట్లాడి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులు బొల్లపల్లి వెంకటస్వామిగౌడ్, బర్ల శ్రీనివాస్, పోన్నం సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

వాసవిమాత ఆలయంలో గోరింటాకు వేడుకలు



గోరింటాకు రుబ్బుతున్న మహిళలు,



చేతులకు పెట్టుకున్న గోరింటాకు చూపుతున్న మహిళలు

సుల్తానాబాద్: పట్టణంలోని వాసవిమాత ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలందరూ ఆలయం ప్రాంగణంలోనే శనివారం గోరింటాకు వేడుకల్లో భాగంగా గోరింటాకు పెట్టుకున్నారు. పూజల అనంతరం పూజారి సంతోష్ శర్మ తీర్థప్రసాదాలు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్, ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పల్లా అపర్ణ, కిషన్, మారుతి, రవీందర్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించండి



పరామర్శిస్తున్న నల్ల మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని నల్ల ఫౌండేషన్ చైర్మన్ నల్లమనోహర్‌రెడ్డి కోరారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని అల్లీపూర్ గ్రామస్తులను, ఆసుపత్రిలో విషజ్వరాలతో బాధపడుతున్న రోగులను శనివారం ఆయన పరామర్శించారు. గ్రామంలో మెడికల్ క్యాంప్ నిర్వహించాలని, రెండురోజుల వ్యవధిలో ప్రైవేట్ ఆసుపత్రి సహకారంతో వైద్య శిబిరం నిర్వహిస్తానని ఆయన వారికి తెలిపారు.

పెద్దాపూర్‌లో వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న మండల వైద్యాధికారి

జూలపల్లి: వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వెటర్నరీ ఆఫీసర్, మండల ప్రత్యేకాధికారి రామస్వామి సూచించారు. మండలంలోని పెద్దాపూర్‌లో వైరల్ జ్వరాలు వస్తున్నాయన్న సమాచారంతో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యశిబిరంలో 78మందికి పరీక్షలు చేసి ముగ్గురు వైరల్ ఫీవర్‌తో బాధ పడుతుండగా రక్త నమునాలు సేకరించారు. ఎంపీడీవో పద్మజతో పాటు ప్రధాన వీధుల్లో పర్యటించి పారిశుధ్యం నిర్వహణను పరిశీలించారు. వైద్యాధికారి సంపత్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ అంజలి, ఏఎన్ఎంలు రుక్మిణి, అనంతరావ్, కార్యదర్శి పున్నమయ్య ఉన్నారు.

గ్రామాల్లో హెల్త్ క్యాంప్ నిర్వహించాలి



సూచనలు చేస్తున్న సీఈవో నరేందర్

యైటింక్లయిన్‌కాలనీ: గ్రామాల్లో హెల్త్ క్యాంప్ నిర్వహించాలని జెడ్పీ సీఈవో నరేందర్ సూచించారు. ఈ మేరకు ఆయన రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలో చేపట్టిన స్పెషల్ శానిటేషన్ పనులను శనివారం పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యం విషయంపై జ్వరాలు రోగాల బారిన పడిన వారి వివరాలను మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామస్థాయి వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. ఎంపీడీవో శైలజరాణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆకాశ్, ఏఎన్ఎం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు నిత్యావసరాలు అందజేత

కమాన్‌పూర్: మండల కేంద్రంతో పాటు పేంచికల్‌పేట గ్రామానికి చెందిన పలు నిరుపేద బాధిత కుటుంబాలకు సుందరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసరాలు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన మట్ట గోపాలు, పేంచికల్‌పేటకు చెందిన ఇరుగురాల లక్ష్మి ఇటీవల మృతి చెందారు. కాగా వారి కుటుంబాలకు 50కిలోల చొప్పున బియ్యం అందజేశారు. గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న మండల కేంద్రానికి చెందిన తోట భూమయ్యకు బియ్యంతో పాటు నెలకు సరిపడా నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఫౌండర్, మాజీ ఎంపీటీసీ బోనాల వెంకటస్వామి, జంగపెల్లి లక్ష్మన్, చెన్నోజు చందు, గెల్లు లింగయ్య, చిప్పకుర్తి అరవింద్ పాల్గొన్నారు.

అప్పు ఇప్పించిన వ్యక్తిపైనే దాడి

యైటింక్లయిన్‌కాలనీ: అప్పు ఇప్పించిన వ్యక్తిపైనే ఆయుధంతో దాడిచేసిన ఘటన రామగిరి మండలం సుందిళ్లలో చోటుచేసుకుంది. గోదావరిఖని టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. సుందిళ్లలోని నర్సింహులపల్లి కాలనీకి చెందిన దండ రాహుల్‌రాజు – ప్రేమలత దంపతులు. రాహుల్‌రాజు ఓసీ–5లో వోల్వో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి పొరిగింటివారు చొప్పరి లక్ష్మణ్ – జ్యోత్స్న దంపతులు. ఈక్రమంలో ఏడాది క్రితం తమకు రూ.1.50లక్షలు అప్పు కావాలని లక్ష్మణ్, జ్యోత్స్న కలిసి రాహుల్‌రాజు దంపతులను అడిగారు. వీరిద్దరూ కలిసి తమకు తెలిసిన సతీశ్ అనే వ్యక్తి వద్ద అప్పు తెచ్చి లక్ష్మణ్ దంపతులకు ఇచ్చారు. ఆర్నెల్లలో అప్పు తీర్చుతానని చెప్పిన లక్ష్మణ్.. ఏడాదైనా ఇవ్వలేదు. దీంతో రాహుల్‌రాజు సతీశ్‌తో కలిసి శుక్రవారం లక్ష్మణ్ ఇంటికి వెళ్లారు. డబ్బులు ఇవ్వాలని అడిగారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. అయితే, శనివారం లక్ష్మణ్.. రాహుల్ రాజు ఇంటికి వచ్చి ఆయుధంతో దాడి చేశాడు. ఈదాడిలో రాహుల్‌రాజు తీవ్రంగా గాయపడడంతో గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య ప్రేమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.